మందెంట పోతుండే ఎలమంద..
పచ్చిక బయళ్ల వెంట అలుపెరగని పాదయాత్ర
నెలల పాటు పల్లెకు దూరం.. గొర్ల మందతో జీవనం
పాలమూరు నుంచి సిద్దిపేట జిల్లాకు కురుమలు
ఎండ, వాన, చలిలోనూ బతుకు పోరాటం
7

భారీ వర్షం


నారాయణఖేడ్‌లో కురుస్తున్న వర్షం

పటాన్‌చెరుజ/నారాయణఖేడ్/మనూరు/రేగోడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని పలు మండలాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పటాన్‌చెరు, నారాయణఖేడ్, మనూరు, రేగోడు మండలాల్లో వర్షం కురిసింది. పటాన్‌చెరు మండలంలో ఏకధాటిగా రెండు గంటలపాటు కుంభవృష్టి కురిసింది. కాలనీలు, పారిశ్రామికవాడలు జలమయమయ్యాయి. పటాన్‌చెరులో జాతీయ రహదారిపై పాత టోల్‌గేటు వద్ద రోడ్డుపై నీరు నిలవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇంద్రేశం నుంచి పెద్దకంజర్ల వరకు రోడ్లన్నీ గుంతలుగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పది రోజుల అనంతరం పెద్ద వర్షం పడటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటివరకు కురుస్తున్న వర్షాలకు పత్తి, సోయా, కంది విత్తనాలు, వరినాట్లు వేసుకున్నా జలవనరుల్లో నీరు అంతంతమాత్రంగానే రావడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో పెద్ద వర్షం రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పత్తి, సోయా, కంది తదితర పంటలు సాగు చేసినప్పటికీ సకాలంలో వర్షాలు లేక పంటలు ఎండుముఖం పడుతున్న సమయంలో వర్షాలు కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రేగోడులో కురుస్తున్న వర్షం

నా కూతురు జయారెడ్డి పెళ్లికి విచ్చేయండి

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు, ఉమ్మడి జిల్లా కార్యకర్తలు, అభిమానులకు జగ్గారెడ్డి పిలుపు

వచ్చే నవంబర్ నెలంతా కాంగ్రెస్ కార్యకర్తలకే పూర్తి సమయం

కార్యకర్తల కూతుళ్లు, చెల్లెళ్ల వివాహాలకు ఆర్థిక సహాయం చేస్తా

అత్యవసర అనారోగ్య సమస్యలు తలెత్తితే అండగా ఉంటా

క్యాన్సర్ పేషెంట్ల గురించి నా దృష్టికి తేవాలి



సమావేశానికి హాజరైన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, ఆగస్టు 4: సంగారెడ్డిలోని రాంమందిర్‌లో ఈ నెల 7న రాత్రి 8.42 గంటలకు నిర్వహించే తన కూతురు జయారెడ్డి వివాహ వేడుకకు హాజరుకావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆహ్వానించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులకు పేరు పేరునా ఇదే తన ఆహ్వానమంటూ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరగార్డెన్‌లో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పార్టీ బాధ్యతల దృష్ట్యా ఒక్కోసారి ఫోన్ లిఫ్ట్ చేయకున్నా తాను చేసే సహాయంలో ఆలస్యం జరగదని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిని వెలిగిస్తున్న గవర్నర్

పల్లె ప్రజలు, రైతాంగ సాధికారతతోనే

జాతీయ సమైక్యత

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ 7

'గీతం'లో జాతీయస్థాయి చర్చాగోష్ఠి

రోడ్డెక్కితే నరకయాతన

సంగారెడ్డి జిల్లాలో అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు

నిధులున్నా.. మరమ్మతులు సున్నా

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

111 పనుల్లో పూర్తయినవి 20 మాత్రమే

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

సంగారెడ్డి జిల్లాలో రహదారుల మరమ్మతుల కోసం సర్కారు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నప్పటికీ అధికారుల అలసత్వం ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. పలు మండలాల్లో కీలకమైన రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ రహదారులపై వాహనాలను నడపాలంటే జంకుతున్నారు. రోడ్ల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో కొందరు పనులు ప్రారంభించనే లేదు. కొంతమంది పనులు ప్రారంభించినా మధ్యలోనే చేతులెత్తేశారు. ఫలితంగా జిల్లాలోని రోడ్లు అధ్వానంగా మారాయి.

-సంగారెడ్డి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి)


కంది: వర్షపు నీరు నిలవడంతో గుంతలమయంగా మారిన బ్యాతోల్‌కు వెళ్లే రహదారి


రేగోడు మండలం సిరూరు సమీపంలో మంజీరా నది వంతెన వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

సంగారెడ్డి జిల్లాలో రహదారుల మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో రెండేళ్ల క్రితం 485 కిలోమీటర్లమేర రోడ్లు మరమత్మలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన 111 పనులకు ప్రభుత్వం రూ.173 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.40 కోట్లతో చేపట్టిన 20 పనులు పూర్తయ్యాయని, 85 కిలోమీటర్ల మేర రోడ్లకు మరమ్మతులు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మిగిలిన పనులకు అతీగతీ లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనుల పురోగతిపై జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ గత నెలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, కాంట్రాక్టర్లు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మరోవైపు కొందరు కాంట్రాక్టర్లు తాము ఇప్పటికే పూర్తిచేసిన పనులకు డబ్బులు రాలేదని మంత్రితో మొరపెట్టుకున్నట్లు తెలిసింది.

ప్రమాదాలు నిత్యకృత్యం

● మెటల్‌కుంట నుంచి అల్లాదుర్గం వెళ్లే ప్రధాన రహదారిపై రాయిపల్లి సమీపంలోని మంజీరా నది వంతెన నుంచి రాయికోడు మండలం సిరూరు వరకు 4 కిలోమీటర్ల రోడ్డు ప్రమాదకరంగా

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డికి భావ్‌నగర్ బ్యాలెట్ బాక్స్‌లు

పటాన్‌చెరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో స్థానిక సంస్థలు నిర్వహించడానికి కావాల్సిన బ్యాలెట్‌బాక్స్‌లు గుజరాత్ నుంచి తీసుకువస్తున్నారు. ఇందుకు జిల్లాకు చెందిన అధికారుల బృందం గుజరాత్ రాష్ట్రంలోని భావ్‌నగర్ జిల్లాకు వెళ్లింది. ఆరు నెలల క్రితమే గుజరాత్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసాయి. అక్కడి బ్యాలెట్ బాక్స్‌లు సంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో భావ్‌నగర్‌కు వెళ్లిన జిల్లా అధికారులు.. కల్హేర్ ఎంపీవో శ్రీకాంత్‌గౌడ్, నందిగామ ఈవో రాజేందర్, ప్రతాప్‌రెడ్డి, సురేష్, ఆకాష్ బ్యాలెట్‌బాక్సులను పరిశీలించారు. 1,953 బ్యాలెట్ బాక్స్‌లు తరలించడానికి సంబంధించిన ఏర్పాట్లపై భావ్‌నగర్ కలెక్టర్ మనీష్‌కు మార్‌భన్సాల్‌తో సమావేశమై చర్చించారు.


స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

సీజనల్ వ్యాధులు దరిచేరొద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపించకుండా మెదక్ జిల్లాలో ఐదు రోజులు శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. ఇందులో భాగంగా నేటి నుంచి ఐదు రోజులు అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలను నిర్మూలించడానికి, వ్యాధుల బారిన పడకుండా సత్వర చర్యలు తీసుకోవడానికి ఐదు రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శానిటేషన్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించి తనకు నివేదికలు సమర్పించాలని మండల ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పారదర్శక సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌వో శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, కలెక్టరేట్ ఏవో యూనస్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.




చందంపేటలో సంగీత పరికరాలతో సాధన చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో

సంగీతం పాఠాలు

విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం

'పీఎంశ్రీ' కింద సంగీత పరికరాలు

మెదక్ జిల్లాలో 13 స్కూల్స్ ఎంపిక

మెదక్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితంకాకుండా ఆసక్తి ఉన్న కళల్లోనూ రాణించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోంది. పాఠశాలల్లో సంగీత పాఠాలు చెప్పేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నది. 'పీఎంశ్రీ' పథకం కింద బడులకు సంగీత పరికరాలు సమకూరుస్తున్నది. దీంతో, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందుకోసం మెదక్ జిల్లాలో తొలి విడతగా 13 పాఠశాలలను ఎంపిక చేశారు. టీఎస్ఎంఎస్(చిన్నశంకరంపేట), టీఎస్ఎంఎస్(రేగోడ్), టీఎస్ఎంఎస్(కోమట్‌పల్లి), టీఎస్ఎంఎస్(జక్కపల్లి), జెడ్పీహెచ్ఎస్(వెల్దుర్తి), జెడ్పీహెచ్ఎస్(పాపన్నపేట), రెసిడెన్షియల్స్ బాలబాలికల(మెదక్, తూప్రాన్), జడ్పీహెచ్ఎస్(బూర్గుపల్లి), జడ్పీహెచ్ఎస్(మక్తాభూపతిపూర్), జడ్పీహెచ్ఎస్(శివ్వంపేట), జడ్పీహెచ్ఎస్(చందంపేట), జడ్పీహెచ్ఎస్ (కౌకల్)ను ఎంపికచేసి సంగీత వాయిద్య పరికరాలు, కవాతు, మేళం, కిట్లు పాఠశాలలకు చేరాయి. సంగీత శిక్షణ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని అకడామిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి పేర్కొన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు సంగీత పరికరాలు చేరాయని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కోసం టీచర్లను నియమించాల్సి ఉందని పేర్కొన్నారు.

రూ. లక్షలు వెచ్చించి నిర్మించారు..

వృథాగా వదిలేశారు..!

మెదక్‌లో వీధి వ్యాపారుల కోసం రూ. 41లక్షలతో దుకాణాల నిర్మాణం

వీధి వ్యాపారులను తరలించాలని ప్రణాళిక

ఆసక్తి చూపని దుకాణదారులు.. కేటాయించని అధికారులు

కూరగాయల మార్కెట్‌గా మార్చితే పది కాలనీలకు ఉపయోగం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారాలు చేసుకునే వారి కోసం నిర్మించిన మార్కెట్ వృథాగా మారింది. 40 మంది వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. రోడ్లపై అమ్మకాలు చేసుకునే వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2022వ సంవత్సరంలో రూ. 15 లక్షలతో మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణాల్లో మార్పులు చేయడంతో అంచనాలు పెరగడంతో అదనంగా రూ. 26 లక్షలు మున్సిపల్ నిధులు కేటాయించారు. షెడ్‌లా చేపట్టాల్సిన నిర్మాణం మాడ్రన్ కూరగాయల మార్కెట్‌గా రూపొందింది. గత జనవరిలో ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. ఇందులో సుమారు 21 గదుల స్థలం ఉండగా ఇందులో 42 మంది చిరు వ్యాపారాలు వ్యాపారం చేసుకునే అవకాశం ఉంది. పట్టణంలోని కీలకమైన జేఎన్ రోడ్‌లో వీధి వ్యాపారాలు చేసేవారిని ఇక్కడికి తరలిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంది. కానీ, ఆరు నెలలైనా మున్సిపల్ అధికారులు ఎవరికీ దుకాణాలు కేటాయించకపోవడంతో మార్కెట్ నిరుపయోగంగా మారింది. వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారింది.

ఆసక్తి చూపని వీధి వ్యాపారులు

ప్రధాన వ్యాపార కేంద్రం జేఎన్ రోడ్ నుంచి పోస్టాఫీస్ వెనక గల నూతన మార్కెట్‌కు వెళ్లాలంటే వీధి వ్యాపారులు ఆసక్తి కనబరచడం లేదు. నిత్యం ప్రజల రద్దీ, రాకపోకలు, వ్యాపారం జరిగే చోట మాత్రమే తమకు గిరాకీ ఉంటుందని వారు పేర్కొంటున్నారు. అధికారులు సైతం వారి దుకాణాలను తరలించేందుకు చొరవ చూపడం లేదు.

కూరగాయల మార్కెట్‌గా...

జిల్లా కేంద్రంలోని 32 వార్డులకు ఒకే కూరగాయల మార్కెట్ ఉంది. నూతనంగా నిర్మించిన వీధి వ్యాపారుల షెడ్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తే పలు వార్డుల ప్రజలకు మార్కెట్ దగ్గరవుతోందని పేర్కొంటున్నారు. 21 దుకాణాలను కూరగాయలు, చికెన్, మటన్ షాపులకు కేటాయిస్తే బాగుందని పేర్కొంటున్నారు. దుకాణాల కేటాయిస్తే తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. పాలకవర్గం లేకపోవడంతో దీనిపై నిర్ణయం తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.


మెదక్‌లో నిరుపయోగంగా ఉన్న దుకాణాలు


సంగారెడ్డి డీఈవో కార్యాలయ ఆవరణలో టీచర్ల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

236 మందికి పదోన్నతి అవకాశం!

సంగారెడ్డి జిల్లాలో ధ్రువపత్రాల పరిశీలన

నేడు ఎస్ఏల తుది సీనియారిటీ జాబితా.. రేపు వెబ్ ఆప్షన్ల నమోదు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో 236 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందే అవకాశం ఉందని విద్యాశాఖ అంచనాకు వచ్చింది. ఇందులో 34 మంది జీహెచ్ఎం, 202 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనున్నట్టు తెలుస్తోంది. సోమవారం ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగింది. పదోన్నతి వద్దనుకున్న ఉపాధ్యాయుల నుంచి నాట్ విల్లింగ్ ఆప్షన్ ఫారాన్ని తీసుకున్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించారు. మరోవైపు జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందనున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితాపై నిరీక్షణ తప్పలేదు. సోమవారం విడుదల చేస్తారనుకున్నా ఆలస్యం కావడంతో నేటికి వాయిదాపడింది. ఈ నెల 6న గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్ల నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్నది.

రెండో విడత పాఠ్యపుస్తకాలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండో విడత పాఠ్యపుస్తకాలు సంగారెడ్డి జిల్లాకు చేరుకుంటున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత పాఠ్యపుస్తకాలు జూన్ నెలలోనే బడులకు సరఫరా చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా జిల్లాకు 2,52,270 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 1,75,120 పుస్తకాలు సంగారెడ్డిలోని పుస్తకాల గోదాంకు చేరుకున్నాయి. మొత్తం పుస్తకాలు వచ్చిన తరువాతనే పాఠశాల పాయింట్లకు చేరవేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.


సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పంపిణీ పాయింట్‌కు చేరుకున్న పుస్తకాలు

ఎండుగంజాయి పట్టివేత

పటాన్‌చెరు/మునిపల్లి ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో అక్రమంగా ఎండుగంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. త్రిపుర రాష్ట్రానికి చెందిన మంగళ్‌దెబ్బర్మా అనే వ్యక్తి 5.5 కిలోల ఎండుగంజాయిని సంగారెడ్డి వైపు మోటారుసైకిల్‌పై రవాణా చేస్తుండగా సీఐ శంకర్ పట్టుకుని పటాన్‌చెరు ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. గోవా నుంచి తీసుకెళ్తున్న గోవా మద్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద గోవా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా అందులో 34 బాటిళ్లు (14.850 లీటర్స్) ఉన్నట్లు గుర్తించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గోవా మద్యాన్ని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం



కసాన్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మాసాయిపేట/ చేగుంట ,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యే విధంగా అధికారులు చూడాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజు ఆదేశించారు. సోమవారం చేగుంట మండలంలోని కసాన్ పల్లి గ్రామంలో ఆకస్మికంగా సందర్శించి పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అంగన్‌వాడి కేంద్రం, గ్రామంలోని పారిశుధ్య పనులను, విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గ్రామంలోని శానిటేషన్ పనులను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా సందర్శించి గ్రామంలో కలియతిరిగారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

మెదక్ అర్బన్ /సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు జిల్లాల నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు భారీగా తరలివచ్చారు. మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ.. అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో బాధితుల సమస్యలు పరిష్కరించాలని సంగారెడిడ సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను బాధితులకు వివరిస్తూ సమాచారం అందించాలని సూచించారు. పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధం అయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మండల కేంద్రానికి చెందిన పబ్బ అశోక్ గుప్తా కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి కూలర్‌కు షార్ట్ సర్క్యూట్ రావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల తమకు భారీ నష్టం జరిగిందని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి. వెంకటయ్యలు అగ్ని ప్రమాద సంఘటనను పరిశీలించారు.

కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ



కుళ్లిన గుడ్లు

చేర్యాల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చుంచనకోట గ్రామ ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీకేంద్రంలో ఇటీవల పలువురికి పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయాయి.

గ్రామానికి చెందిన పొట్టి మానస ఇటీవల అందించిన గుడ్లను పరిశీలించగా కుళ్లిపోవడంతో ఖంగుతింది. ఇదేంటని అంగన్‌వాడీకేంద్రం నిర్వహకురాలికి వివరించగా, తామేం చేస్తామని సమాధానం ఇచ్చిందంటూ వాపోయింది. కొంతకాలంగా తరచూ కుళ్లిపోయిన గుడ్లనే అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత, ప్రమాణాలున్న మేలురకం గుడ్లను అందించాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జీకేవైర్ పరిశ్రమ సమీపంలోని సోమవారం ఒక గుర్తు తెలయని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన స్థానికులకు మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు (40) ఉండొచ్చని చెప్పారు. చనిపోయిన వ్యక్తి మతిస్థిమితం లేదని తెలిపారు. మృదేహాన్ని పోస్టుమార్ట నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ కోసం మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

ద్విచక్రవాహనంలో గేదె తాడు చిక్కి..

దుబ్బాక, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదె తలుగు(తాడు) ద్విచక్రవాహనంలో చిక్కి ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ, సోమవారం మృతి చెందాడు. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన ముదిగొండ రాజేశం(55) గ్రామంలో కిరాణ దుకాణం వ్యాపారం చేస్తాడు. అతడు, భార్య చంద్రకళతో కలిసి ఆదివారం కిరాణసామగ్రి కోసం దుబ్బాకకు వచ్చి వెళ్తుండగా, దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ శివారులో కట్టేసిన గేదె రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దాన్ని కట్టేసిన తాడు(తలుగు) ద్విచక్రవాహనంలో చిక్కి ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలైన రాజేశంను దుబ్బాక నుంచి సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి అటునుంచి యశోద ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలై..

● చికిత్స పొందుతూ మహిళ మృతి

దుబ్బాక, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు తీసుకునేందుకు వెళ్లి రోడ్డుదాటుండగా ఓ మహిళను మోటర్‌సైకిల్ ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గుజ్జెటి కిష్టయ్య భార్య బాలమణి ఆదివారం సాయంత్రం గ్రామంలోని అంగడిలో కూరగాయలు తీసుకుని తిరిగి వస్తుండగా, సిద్దిపేట నుంచి వేగంగా వస్తున్న తప్పనగుల్లకు చెందిన రఘునందన్ మోటర్ సైకిల్ ఢీకొనడంతో ఆమెను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లుగా భూంపల్లి ఎస్సై హరికృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కొమురయ్య (ఫైల్)

చేగుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం కర్నాల్ పల్లిలో జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాల్ పల్లి గ్రామానికి చెందిన గ్యాదరి కొమురయ్య (55) జూలై 20న చేగుంటలో యూరియా బస్తాలు తెస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. 15 రోజులైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో సోమవారం కొమురయ్య భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగాచి బాధిత కుటుంబాలకు
పరిహారం ఒకే విడతలో చెల్లించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం ఒకే విడతలో చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సిగాచి పరిశ్రమ కార్మికుల కుటుంబాలతో కలిసి సోమవారం నిర్వహించిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. రూ.కోటి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చారని, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇస్తామని రూ.4.5 లక్షలు మాత్రమే ఇచ్చి మోహం చాటేశారని విమర్శించారు. ఘోర ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శి సాయిలు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కూరగాయలతో వంటలు

● ప్రజావాణిలో ఫిర్యాదు గురుకుల పాఠశాల వంటమాస్టర్

ఝరాసంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కుళ్లిపోయిన కూరగాయలతో చేసిన వంటలను విద్యార్థులకు వడ్డిస్తున్నారని మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల వంటమాస్టర్ వెంకటేశం సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి అధికారులకు ఫిర్యాదును అందజేశారు. అలా కుళ్లిపోయిన కూరగాయలతో తాను వంట వండనని, విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని అన్నందుకు పాఠశాల ప్రిన్సిపాల్ తనను దుర్భాషలాడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

మిరుదొడ్డి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య తెలిపారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న రామచంద్రపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో సీనియర్, జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. సీనియర్ జట్టులో శశికుమార్, శ్రీనివాస్, చైతన్య, భార్గవ్, సాయికృష్ణ, రవి, కిరణ్‌కుమార్, రవితేజ, సబ్‌జూనియర్ బాలికల జట్టుకు శ్రావణి, నిహారిక, నందిత, లలిత, శరణ్య, సఫియా, సోహ, జెస్సీ, మనోవర్షిని, శ్రీతజ, తన్వీ, బాలుర జట్టుకు చైతన్య, కృష్ణసాయి, సాయిసిద్విక్, మణికంఠ, సాకేత్, మోయిన్, భువన్, అక్షిత, లలిత్, కౌశిక్‌లు ఎంపికయ్యారు. ఈనెల 23, 24న రాష్ట్రస్థాయిలో జరిగే బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొంటారని చెప్పారు.

భద్రాచలం రామాలయానికి పాదయాత్ర



భద్రాచలంకు పాదయాత్రగా వెళ్తున్న నాయకుడు వేణుమాదవ్

సదాశివపేట, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మంపై జరుగుతున్న అసాంఘిక శక్తుల దాడులను నిరసిస్తూ హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సదాశివపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాదవ్ భద్రాచలం రామాలయానికి పాదయాత్ర చేపట్టారు. సోమవారం సదాశివపేట పట్టణం కృష్ణానగర్‌కాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వరరావు, దేశ్‌పాండే, ఓదుల మాణిక్‌రావు, అంబదాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి టీచర్ లైంగిక వేధింపులు

● స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటన సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో చోటుచేసుకున్నది. ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు వినయ్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలపగా, సోమవారం వారు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేసే వినయ్ రోజు మానసికంగా వేధించేవాడని, బూతులు మాట్లాడేవాడని బయటికి విషయం చెప్పలేక లోలోన ఏడ్చేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ బిడ్డను లైంగికంగా వేధించిన టీచర్‌ను తమకు అప్పగించాలని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన నిర్వహించగా పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సంగారెడ్డి పట్టణ పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీఐ రమేష్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు వినయ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోక్సో కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..
లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

గజ్వేల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని రాణే పరిశ్రమ వద్ద రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొట్టగా, ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన రంగనబోయిన రాజ్‌కుమార్(26) తన భార్య సంధ్యతో కలసి మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి బోనాల పండుగ నిమిత్తం వెళ్లిన ఆయన ఆదివారం సాయంత్రం బస్సులో గజ్వేల్ మండలం అక్కారం మధిర గ్రామమైన కోనాపూర్‌కు వచ్చాడు. అక్కడి నుంచి తన బావమరిది అయిన రిప్పల సందీప్(19) (సంధ్య సోదరుడు)తో కలసి కారులో మేడ్చల్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో రాణే పరిశ్రమ వద్ద ముందు వెళ్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తలకు, సందీప్ ఛాతిలో బలమైన గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విషయమై రాజ్‌కుమార్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

తండ్రికి పక్షవాతం..
మనస్తాపంతో కుమార్తె ఆత్మహత్య

నిజాంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తండ్రి పక్షవాతానికి గురికాగా, సేవలు చేస్తూ బెంగతో కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నార్లాపూర్‌లో విషాదాన్ని నింపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బొడ్డు స్వామికి ఏడాది క్రితం నార్లాపూర్ గ్రామానికి గాలం లక్ష్మణ్ కూతురు జ్యోతి(24)తో వివాహమైంది. కాగా పెళ్లయిన కొద్దిరోజులకే లక్ష్మణ్‌కు పక్షవాతం వచ్చింది. తండ్రికి సేవ చేసేందుకు మూడు నెలల క్రితం జ్యోతి పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి ఏదో కోల్పోయినట్టు బాధపడేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన జ్యోతి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తెల్లారితే చాలు, వీరిది బతుకు పోరాటం. పొద్దుగూకే వరకు గొర్ల మందలతో అలుపెరగని పాదయాత్ర. జీవితమంతా జీవాలతోనే జీవనం. పండుగలు ఉండవు, పబ్బాలు లేవు. చలి, ఎండ, వానలతో సహవాసం చేస్తారు. ఊరికి దూరంగా సంచార జీవితం గడుపుతారు. రోజులు కాదు, నెలల తరబడి సాగుతూనే ఉంటారు. ఈ గాథ పాత మహబూబ్‌నగర్ జిల్లా కురుమలది. గొర్ల మందలతో పరకాల నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట రంగనాయకసాగర్ వైపు వెళ్తున్న వీరిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

- హుస్నాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి)



మందెంట పోతుండే ఎలమంద

వంతుల వారీగా ఇంటికి వెళ్తాం

మందలతో నెలల తరబడి ఉంటాం. వంతుల వారీగా ఇళ్లకు వెళ్తుంటాం. మళ్లీ మందకు చేరుకునేందుకు సెల్‌ఫోన్‌లు ఉండటంతో మావాళ్లు ఎక్కడున్నారో తెలుసుకోవడం సులభమైంది. సంచార జీవితం గడిపే మా కురుమలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలి. అంతేకాకుండా మాకు ఇన్సూరెన్స్ చేయించాలి.

- బేక్మారుపల్లి వెంకటేష్, మరికల్

జీవాల కోసం పచ్చిక బయళ్ల వెంట అలుపెరగని పాదయాత్ర

నెలల పాటు పల్లెకు దూరం..
గొర్ల మందతో సహజీవనం

పాలమూరు నుంచి సిద్దిపేట
జిల్లాకు వలసొచ్చే కురుమలు

ఎండ, వాన, చలిలోనూ
బతుకు పోరాటం

పాత మహబూబ్‌నగర్ జిల్లా, ప్రస్తుత నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం వీరి స్వస్థలం. నీటి వనరులు లేక, పచ్చగడ్డి దొరక్క మందలను తోలుకొని నీరు, పచ్చిక ఉన్న ప్రాంతాలకు వెళుతుంటారు. తరతరాలుగా ఇలా వెళ్తూనే ఉన్నారు. దగ్గర్లోనే నదులు ఉన్నా ఒక్క చుక్క నీరు దక్కక జీవాలతో సంచార జీవనయాత్రను సాగిస్తున్నారు. గతంలో ఏడాదికి పైగా మందలతోనే ఉండేవారమని, ఇప్పుడు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో రెండు నెలలకు ఒకసారి, ఏదైనా అత్యవసరమైతే నెలకోసారి వంతుల వారీగా ఇంటికి వెళ్లి వస్తున్నామని వారు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ జీవన యాత్ర సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగుతుంది. రాత్రిపూట ఊర్లకు దూరంగా మైదానాల్లో బస చేసి, మందల మధ్యే వంటలు చేసుకుంటారు. ఈ వర్షాకాలంలో వీరి కష్టాలు వర్ణనాతీతం. వంట చేసుకోవడానికి, పడుకోవడానికి చాలా ఇబ్బందులు పడతారు. అయితే, సెల్‌ఫోన్‌లు ఉండడంతో ఇంటి క్షేమ సమాచారాలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది మంది కురుమలు దాదాపు 1500 గొర్లతో హుస్నాబాద్ మీదుగా సిద్దిపేటకు వెళ్తున్నారు. రోజుకు కనీసం 15 కిలోమీటర్ల మేర నడుస్తూ, గొర్లను మేపుకుంటూ ప్రయాణం సాగిస్తారు.


అనారోగ్యం బారిన గొర్రె పొట్టెలుకు మందు పోస్తున్న కురుమలు

పండుగలకు వెళ్లలేం

ఈ మందలతో పండుగలకు ఇంటికి పోవడం కుదరదు. బంధువులు చనిపోయినా వెళ్లలేం. చిన్నప్పటి నుంచి మందలతోనే జీవిస్తున్నాను. మాకు వ్యవసాయ భూమి ఉన్నా నీళ్లు లేకపోవడం వల్ల ఇలా సంచార జీవితం గడుపుతున్నాం. ఈ జీవాలే మాకు జీవనాధారం. మా తాతలు, తండ్రుల నుంచి వస్తున్న ఈవృత్తిని బతుకుతెరువు కోసం కొనసాగి

-పొకిటి ఆంజనేయులు, మరికల్, నారాయణపేట జిల్లా

తెలంగాణ జిల్లాల్లోనే సంచారం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లడం మానేశామని కురుమలు తెలిపారు. ఇప్పుడు గజ్వేల్, ప్రజ్ఞాపూర్, కొమురెల్లి, చేర్యాల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, పరకాల ప్రాంతాల్లో సంచరిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతాల్లో రెండు నుంచి మూడు నెలలు ఉండి, మళ్లీ హుస్నాబాద్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి మీదుగా పరకాల వైపు తిరిగి వెళుతుంటామని వివరించారు. గొర్లను రోగాల బారిన పడకుండా వారే సొంతంగా వైద్యం చేసుకుంటారని, కొన్నిసార్లు చిటుకు రోగాలు వస్తే పదుల సంఖ్యలో జీవాలు చనిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇంటి ఖర్చులకు, ఇతర అవసరాలకు గొర్లను అమ్ముతుంటారు. వీరి మీద నమ్మకంతో వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఒక్కో గొర్రెకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర వస్తుంది.


ఓ చెట్టు కింద వంట చేసుకుంటున్న గొర్రెలకాపరులు





సామగ్రి మోసేందుకు గాడిదలు

తమ నిత్యావసర వస్తువులు, బట్టలు, ఇతర సామగ్రిని మోసేందుకు గాడిదలను ఉపయోగిస్తారు. ఒక్కో గాడిదను రూ.20 వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈ గాడిదలు ఎంత బరువైనా మోస్తాయని తెలిపారు. గొర్రెలకు ఏవైనా రోగాలు వచ్చి నడవలేకపోతే, వాటిని ఆటోల ద్వారా దగ్గరలోని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్తారని తెలిపారు. పొలాల్లో గొర్రెలు మేస్తే జరిమానాలు చెల్లించిన సందర్భాలు కూడా ఉన్నాయని వారు చెప్పారు.


గొర్రెకాపరుల సామగ్రితో గాడిదలు

పల్లె ప్రజలు, రైతాంగ
సాధికారతతోనే జాతీయ సమైక్యత

● గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
● 'గీతం'లో జాతీయ చర్చాగోష్ఠి ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతకు చిహ్నం భారత్ అని, పల్లె ప్రజలు, రైతాంగ సాధికారతతోనే దేశ సమైక్యత బలోపేతమవుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించారు. 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు: చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు' అనే అంశంపై పొలిటికల్ సైన్స్ విభాగం చర్చాగోష్ఠిని నిర్వహించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ గొప్ప పాత్ర పోషించారని కొనియాడారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేదని అన్నారు. చారిత్రక బార్డోలి సత్యాగ్రహం (1928)లో పటేల్ నాయకత్వాన్ని, రైతులు, భూమిలేని కార్మికుల సాధికారత కోసం ఆయన చేసిన కృషిని గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామీణ భారతదేశం జాతికి ఆత్మలా మిగిలిపోతుందని చెప్పారు. పేదలు, అణగారిన వర్గాలతో మన జీవితాలను పంచుకోవడంలో ఆనందం ఉందని జిష్ణుదేవ్‌వర్మ వ్యాఖ్యానించారు. సదస్సు ప్రారంభానికి ముందు గవర్నర్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్‌టీ-సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సంజయ్ జోషి 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' విశిష్టతను వివరించారు. సామాజిక సమరసత మంచ్ జాతీయ కన్వీనర్ కె.శ్యామ్‌ప్రసాద్ పటేల్ నాయకత్వం గురించి మాట్లాడారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు స్వాగతోపన్యాసం చేశారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ గుబ్బం అశోక్ వందన సమర్పణతో ప్రారంభ కార్యక్రమం ముగిసింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా అనేక మంది ప్రముఖ పండితులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. వీరిలో గుజరాత్‌లోని సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, ములుగులోని సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ షీలారెడ్డి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి జి.నాగరాజు తదితరులు ఉన్నారు.


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

దళితులపై దాడి చేసిన
పోలీసులపై చర్యలు తీసుకోవాలి

డీబీఎఫ్ ఆధ్వర్యంలో మెదక్ అడిషనల్ ఎస్పీకి బాధితుల వినతి

మెదక్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల కొండాపూరం గ్రామంలో దళితులపై దాడి చేసిన చేగుంట, బైంసా పోలీసులపై కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఘటనలో మఫ్టీలో ఉన్న పోలీసులు ఓ కేసు విచారణ పేరుతో జూన్ 18న దళిత యువకుడు సురేష్‌ను చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. భయపడిన సురేష్ ఇంటికి పారిపోయి, కాలనీలోని ప్రజలకు చెప్పడంతో వారు మఫ్టీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఒకరు దొరికారని అతన్ని మాజీ సర్పంచ్‌కు అప్పగించి చేగుంట పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. అయితే, పోలీసులు విచారణ లేకుండానే అతడిని విడిపించేందుకు ప్రయత్నించడంతో గ్రామస్థులు అడ్డుకోగా, కాలనీలో లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో అనేక మందికి గాయాలయ్యాయని, పోలీసులు మహిళా కానిస్టేబుల్ లేకుండానే మహిళలను అరెస్ట్ చేసి వెంట్రుకలు పట్టి లాగి జీపులో తరలించారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎనిమిది మందిపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కేసులను వెంటనే ఎత్తివేయాలని, దాడి చేసిన చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి, బైంసా ట్రైనీ ఎస్ఐ, కానిస్టేబుళ్లతో పాటు ఘటనలో ఉన్న పోలీసులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణకు ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లకు కూడా ఫిర్యాదు చేసి పోరాటం చేస్తామన్నారు. స్పందించిన అడిషనల్ ఎస్పీ, తూప్రాన్ డీఎస్పీతో మాట్లాడి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

శ్రావణ పూజలు

కోహీర్/పెద్దశంకరంపేట/నారాయణఖేడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకుని కోహీర్ మండల పరిధి బడంపేట శ్రీరాచన్నస్వామి ఆలయంలో, పెద్దశంకరంపేట మండల పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. బడంపేట శ్రీరాచన్నస్వామి ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. పెద్దశంకంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయం, పేట శివారులోని గురుపాదప్పగుట్ట శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, గొట్టిముక్కులలోని రాజులగుట్టపై వెలసిన శివాలయంలో విశేష పూజలను నిర్వహించారు. కొప్పోలు ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, పత్రి పూజ చేశారు. నారాయణఖేడ్ మార్కండేయ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, భస్మాహారతి పూజలను నిర్వహించారు.


కోహీర్ మండలం బడంపేట రాచన్నస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు


పెద్దశంకరంపేట మండలంలో కొప్పోల్‌లో పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

కుటుంబానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శ

కొల్చారం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆరే పశుపతి రావు, అరె రవీందర్‌రావు మాతృమూర్తి షావుబాయి అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం షావుబాయిని పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు తునుకుల పల్లి సంతోష్‌రావు ఉన్నారు.

థీమ్‌పార్కు పనుల పరిశీలన

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో నిర్మితమవుతున్న థీమ్ పార్కు పనులు హెచ్ఎండీఏ అధికారులు కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ చుట్టుపక్కల కాలనీల వాసులకు ఆహ్లాదాన్ని పంచేటట్టు పార్కును తీర్చిదిద్దాలని కార్పొరేటర్ కోరారు. ఇందులో హెచ్ఎండీఏ ఏఈ రంజిత్ ఉన్నారు.

కేజీబీవీలో ఎంఈవో తనిఖీ

కంగ్టి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈవో రహీమొద్దీన్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బాలికలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి నివాళులు

నారాయణఖేడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న బండి సంగమేశ్వర్‌రెడ్డి అకస్మికంగా మృతిచెందడం పట్ల సోమవారం జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని బార్ అసోసియేషన్ రూంలో ఆయన చిత్ర పటానికి న్యాయవాదులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం న్యాయవాదులు సంతాప సూచకంగా విధులను బహిష్కరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నిజాంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నగరం గ్రామంలో సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామసభలో పంచాయతీ అభివృద్ధి, పనితీరును కొలిచే సూచికను ఆయా శాఖలకు 2023-24 డేటాను చదివి వినిపించారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

కౌడిపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి నర్సాపూర్ జడ్జి హేమలత రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. 2న కౌడిపల్లి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మెదక్ పట్టణానికి చెందిన జహంగీర్ మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి హేమలత రెండురోజుల జైలు శిక్ష విధించిందని ఎస్ఐ చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిన్నశంకరంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నలుగురు పేకాటరాయుళ్లను సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద జూదం ఆడుతున్నట్లు నమ్మదిగన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నలుగురిని పట్టుకున్నారు. పలువురు పరారయ్యారు. వారి నుంచి ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి'

పుల్‌కల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గుగులోత్ నరసింహ సూచించారు. చౌటకూర్ మండలం కోర్పోలు, సుల్తాన్‌పూర్, సరాఫ్‌పల్లి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ బుక్స్ అందజేశారు.

బీజేపీలో చేరిన యువకులు

మెదక్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 25వ వార్డుకు చెందిన పలువురు యువకులు మనోజ్‌యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారికి బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

చేగుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఎంతో మేలు జరుగుతుందన్నారు.

గొల్ల కురుమల సమస్యల పరిష్కారానికి కృషి

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- కురుమ సంఘం బాధ్యులకు సన్మానం

నారాయణఖేడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నియోజకవర్గంలోని గొల్ల కురుమల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఇటీవల గొల్ల కురుమ సంఘం నియోజకవర్గ, మండలాల కార్యవర్గాల ఎన్నికలు జరుగగా ఎన్నికైన బాధ్యులను సోమవారం ఎమ్మెల్యే, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం కురుమ సంఘం బాధ్యులు సంజీవరెడ్డిని, చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్ల కురుమలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కాగా ఖేడ్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన నర్సమ్మకు రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌చౌహాన్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

పదేళ్ల కళను నెరవేర్చిన ప్రభుత్వం

కల్హేర్/సిర్గాపూర్/కంగ్టి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కళను నెరవేర్చిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్‌లోని రైతు వేదికలో సోమవారం రేషన్‌కార్డు మంజూరుపత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. ప్రతీ ప్రభుత్వ పథకానికి రేషన్‌కార్డు అవసరమని, రేషన్‌కార్డుల కోసం పదేళ్లుగా పేదలు నిరీక్షించి నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిర్గాపూర్ మండల అధ్యక్షుడు మనీష్ పాటిల్, సీనియర్ నాయకులు యాదవరెడ్డి, శ్రీనివాసరావ్, స్వప్న శంకరయ్యస్వామి పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన కంగ్టిలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు మనోజ్ పాటిల్, సర్దార్, పండరినాథ్, నాగ్‌నాథ్, పరశురాం, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

శ్రద్ధగా చదివితేనే ఉజ్వల భవిష్యత్

- జిల్లా విద్యాశాఖ ప్రత్యేక అధికారి రమణకుమార్

కంది/కొండాపూర్/మునిపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే తల్లిదండ్రు కష్టాల్ని అర్థం చేసుకుని శ్రద్ధగా చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ ప్రత్యేక అధికారి (అదనపు డైరెక్టర్ ఆఫ్ టెక్స్‌బుక్స్) రమణకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన కందిలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో జోగప్పతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. టెక్స్‌బుక్స్ వర్క్‌బుక్స్ అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కొండాపూర్ మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రమణకుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిధుల ఖర్చుపై ఆరాతీసి, అపరిశుభ్రతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లేపల్లి, కొండాపూర్ పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై ఆరాతీసి, ఉచిత నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఫలితాలు, టీచింగ్, వర్క్ పుస్తకాలను పరిశీలించారు. కొండాపూర్ మండల విద్యా వనరుల కార్యాలయ ఆవరణలో అపరిశుభ్రత, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల సమావేశాల గది సక్రమంగా లేకపోవడం వంటి వాటిపై ఆగ్రహం వక్తం చేశారు. ప్రతిరోజు విద్యార్థులను క్రీడల్లో భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన వెంట డీఈవో వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఎంఈవో దశరథ్, సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలను జిల్లా విద్యాశాఖ ప్రత్యేక అధికారి రమణకుమార్, సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురభి చైతన్య, వైస్ ప్రిన్సిపల్ రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.



కంది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న రమణకుమార్

ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్

- ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పద్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోసమే కాంగ్రెస్ హామీలు, పథకాలని సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనతో రైతులు, ప్రజలు అష్టకష్టలు పడుతున్నారన్నారు. రైతుల సమస్యలపై 7న మెదక్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి జయశ్రీ

నర్సాపూర్/పెద్దశంకరంపేట/నారాయణఖేడ్/జిన్నారం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ఇంటింటికీ అందేలా చూడడమే మహాజన్ సంపర్క్ అభియాన్ ఇంటింటికి అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయశ్రీ పేర్కొన్నారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్‌తో కలిసి మండలంలోని గూడెంగడ్డలో ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాల పంపిణీతో పాటు పథకాల గురించి స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు కోణం విఠల్, సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు బొగుడాల కృష్ణ పాల్గొన్నారు. ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజురాథోడ్, బీజేపీ మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. జిన్నారంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



గూడెంగడ్డలో ఇంటింటి ప్రచారంలో జయశ్రీ

ఆరోగ్య భద్రతకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య భద్రతకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి అని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వివిధ శాఖల అధికారులతో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, 18న మాప్‌అప్ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల, డీఐవో డా.శశాంక్, వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికం

మెదక్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికమని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నట్లు తెలిపారు. ఉచితం, ఎక్కువ లాభమని అంటే అది మోసమని గ్రహించాలని సూచించారు. గుర్తు తెలియన వ్యక్తులు ఎవరైనా కాల్ చేసి లోన్ ఇస్తామని చెప్తే నమ్మి మోసపోవద్దన్నారు. ఏదైనా సైబర నేరం జరిగితే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

పేదలకు సీఎం సహాయనిధి వరప్రదాయిని : ఎమ్మెల్యే

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు కార్పొరేట్ వైద్యమందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయని అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కుమ్మరి బస్వరాజు కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, వెంకట్‌రెడ్డి, దశరథరెడ్డి, పాండు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తదితరులు

గుమ్మడిదల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 11 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అవినీతిరహిత పాలన అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి, చైతన్యం తీసుకొచ్చినప్పుడే రాష్ట్రంలో బీజేపీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు వీ.ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఐలయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతోనే పేదలకు ఆత్మ గౌరవం

పుల్‌కల్/మనూరు/కొండాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి పథకం కింద పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రజలు గౌరవ ప్రదమైన జీవనం గడుపుతారని జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో లబ్ధిదారుడికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. మనూరు మండల పరిధిలోని మాయికోడ్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే సోదరుడు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే మండల కేంద్రమైన కొండాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాపు పనులను ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ మాధవరెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకే అందజేయాలి

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ శివారులో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం డబుల్ బెడ్‌రూం గృహాలను గతంలో లాటరీ ద్వారా అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకే కేటాయించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 795 డబుల్ బెడ్‌రూం గృహాలను నిర్మించామన్నారు. అధికారులు అప్పట్లో లాటరీ విధానంతో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ గృహ ప్రవేశాలు చేయిద్దామనుకునే దశలో ఎన్నికల కోడ్ రావడంతో చేయించలేక పోయామన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే గతంలో ఎంపికైన వారికి కాకుండా తమ పార్టీ వారికి కేటాయించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ రుబీనాబేగంనజీబ్, పట్టణ అధ్యక్షుడు నగేష్, మాజీ ఎంపీటీసీ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు చేస్తున్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య

తూప్రాన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నయా ఉదారవాద ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్‌లో డిసెంబరు 7-9 తేదీల్లో జరిగే 5వ రాష్ట్ర మహాసభలు పురస్కరించుకొని 'లేబర్ కోడ్స్-కార్మికులపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సెమినార్‌కు వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల లాభాల కోసం కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం, ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ అడివయ్య పాల్గొన్నారు.

రోడ్డెక్కితే నరకయాతన

(5వ పేజీ తరువాయి)



జహీరాబాద్ నుంచి కర్ణాకటలోని బోనస్పూర్ వరకు గుంతలమయంగా మారిన రహదారి

మారడంతో రెండేళ్ల క్రితం రూ.7 కోట్లు మంజూరయ్యాయి. కంకర, మట్టి వేసిన అనంతరంసంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో, ఆ రోడ్డుపై వాహనాలు నడపాలంటే వాహన చోదకులు బెంబెలెత్తుతున్నారు. అదమరిస్తే మంజీర నదిలోకి పడిపోయే ప్రమాదం పొంచి ఉన్నదని వాపోతున్నారు.

- జహీరాబాద్ నుంచి కర్ణాటకలోని బోనసూర్ వరకు 25 కిలోమీటర్ల మేర రహదారి పునరుద్ధరణ కోసం రెండేళ్ల క్రితం రూ.4.50 కోట్లు కేటాయించారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు మొదలు పెట్టడం లేదు.
- అందోలు మండలం సంగుపేట నుంచి పోచారం వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతుల కోసం రూ.3 కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ పనులు చేపట్టడం లేదు.
- సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి గణేష్ గడ్డ చౌరస్తా వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారినప్పటికీ పనులు సాగడం లేదు.
- మునిపల్లి మండలం తాటిపల్లి నుంచి మక్తక్యాసారం వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర రోడ్డు అడుగుకో గుంత ఏర్పడినప్పటికీ, ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈ రోడ్డుపై ఇటీవల ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోయి పక్కకు ఒరిగి తృటిలో ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే.
- బుస్సారెడ్డిపల్లి (సింగూరు) రోడ్డు కూడా గుంతలమయంగా మారినప్పటికీ మరమ్మతులు చేపట్టడంలేదు.
- కంది: కంది మండలంలోని బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తాండ, కొయ్యగుండు తండాతో పాటు ఇస్మాయిల్‌ఖాన్ పేట్ బైపాస్ రోడ్డు, ఎర్దనూర్, ఉత్తర్‌పల్లికి వెళ్లే రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కలివేముల నుంచి మక్తఅల్లూర్ వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. రెండు సంవత్సరాలుగా ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లన్ని అధ్వాన్నంగా తయారయ్యాయి.

మాటల్లో కాదు.. చేతల్లో పనులు : మైనంపల్లి



రామాయంపేటలో మాట్లాడుతున్న హనుమంతరావు

రామాయంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తాను మాటల్లోనే కాదు.. చేతల్లో పనులు చేసి చూపుతున్నా. సొంత ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నట్లు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం రామాయంపేటలో స్టోన్ క్రషర్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ మైనంపల్లి సోషల్ ఆర్గనైజేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఊరూరా తాను చేపట్టిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయన వెంట సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, దేమే యాదగిరి ఉన్నారు.

భూ సర్వేలో డిటైలేజన్ కీలకం

కంది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : భూ సర్వేలో డిటైలేజన్ కీలకమని, సర్వే చేసేటప్పుడు భూ కొలతలు, హద్దుబందుల్లో తేడా రావద్దని సీనియర్ సర్వేయర్ కోటేశ్వర్‌రావు అన్నారు. కంది మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం ఆయన 11 మంది నూతన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. భూమిని ఎలాంటి పద్ధతుల్లో కొలవాలి, డిజిటల్ సర్వే విధానం ఎలా ఉంటుందో వారికి తెలిపారు. రైతులు తమ భూములను సర్వే అర్జీ పెట్టుకుంటే ఎన్నిరోజుల్లో సర్వే పూర్తి చేయాలి, ఎప్పుడు వారికి ఎన్‌వోసీ ఇవ్వాలో తెలిపారు. పాత పద్ధతిలో గొలుసులను పట్టి చేసే సర్వేపై కూడా అవగాహన కల్పించారు. నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్, నూతన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసమే 'ప్రజావాణి'

సంగారెడ్డి రూరల్/కంది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సౌలభ్యం కోసమే ప్రజావాణి ప్రారంభించామని తహసీల్దార్ జయరామ్‌నాయక్ తెలిపారు. సంగారెడ్డి మండలం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సంగారెడ్డి మండలంలోని ప్రజల నుంచి అర్జీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఏవో యూన్సిలక్ష్మీబాయి, వివిధ శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం కంది మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై మూడు దరఖాస్తులు అందాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

చేగుంట ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ సబ్ డివిజన్ షీటీమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం తెలియవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐజీ కాలనీలో పైపులైన్ రగడ

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో రూ.47 లక్షలతో నిర్మిస్తున్న మురుగు పైపులైన్ నిర్మాణంపై అధికారులు, కాలనీవాసులు గొడవ పడ్డారు. వరదల ముంపు ప్రాంతాల్లో వేసే పైపులైన్ తరహాలో నిర్మాణం వద్దంటూ కాలనీవాసులు అడ్డుచెప్పారు. వర్షాలకు ఎటువంటి ముప్పు రావడం లేదని వివరించారు. అవసరం లేని ప్రాంతాల్లో నిధులు ఖర్చు చేస్తున్నారని బీజేపీ నాయకుడు శ్రీకాంత్ చెప్పారు. కాలువలను వినియోగంలోకి తెస్తే సరిపోతుందని అన్నారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. బీడీఎల్ కాలనీ నుంచి ఎల్ఐజీ కాలనీ మీదుగా వర్షపునీరు వెళ్లడానికి వీలుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచనల పైపులు వేస్తున్నామని ఇంజనీరింగ్ ఈఈ సురేష్‌కుమార్ చెప్పారు.

నీటిని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోండి

జోగిపేట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సింగూరు నుంచి కాలువల ద్వారా జోగిపేట కొత్త చెరువులోకి వచ్చే నీటిని అడ్డుకుంటున్న ఆ గ్రామాల రైతులపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సింగూర్ కెనాల్ నుంచి పైపుల ద్వారా జోగిపేట కొత్త చెరువులోకి మండల పరిధిలోని మాసానిపల్లి గ్రామం నుంచి నీళ్లు వస్తాయని, మాసానిపల్లి చెరువులోకి వెళ్లే కాల్వ కూడా వేరేగా ఉన్నదన్నారు. అయితే జోగిపేట చెరువులోకి నీరు రాకుండా మాసానిపల్లి గ్రామ రైతులు కొంతమంది అడ్డుపడుతున్నారని వాపోయారు. రాత్రివేళలో చెరువు పైపులైన్, బేస్‌మెంట్ గడ్డెను ధ్వంసం చేసి చెరువులోకి నీరు రాకుండా చేశారన్నారు.